

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY










PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి   బుధవారం 09 ఫిబ్రవరి 2022   సంపుటి: 03   సంచిక: 157   పేజీలు: 4   వెల: రూ 3-00


## లక్షా 84 వేల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం: సీఎం జగన్



అమరావతి: రాష్ట్రంలో రజక, నాయీబ్రాహ్మణ, దర్జీల సంక్షేమం కోసం వరుసగా రెండో ఏడాది 'జగనన్న చేదోడు' పథకం కింద రూ. 285.35 కోట్ల నగదు విడుదల చేశారు. 2,85,350 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 285.35 కోట్ల నగదును సీఎం వైఎస్ జగన్ జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని అన్నారు. జగనన్న చేదోడు కింద 2.85 లక్షల మందికి సాయం చేశామని తెలిపారు.షాపులున్న 1,46,103 మంది టైలర్లకు రూ. 146.10 కోట్లు, షాపులున్న 98,439 మంది రజకులకు 98.44 కోట్లు, షాపులున్న 40,808 మంది నాయీబ్రాహ్మణులకు రూ. 40.81 కోట్ల సాయం అందిస్తున్నామని తెలిపారు. లంచాలు, వివక్షతకు తావు లేకుండా పారదర్శకంగా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. వరుసగా రెండో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద సాయం అందజేస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గత ప్రభుత్వం నీరుగార్చిందని అన్నారు.సాయం పేరుతో గతంలో నాణ్యతలేని పరికరాలు ఇచ్చారని సీఎం జగన్ తెలిపారు. సాయం అందించడంలో కమిషన్లు తీసుకున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 60 శాతం మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు. శాసనసభ స్పీకర్ పదవిని కూడా బీసీలకే ఇచ్చామని గుర్తుచేశారు. 427 ఎంపీపీ పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ఇచ్చామని తెలిపారు. 32 ఎమ్మెల్సీల్లో 18 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చామని, 13 జిల్లా పరిషత్ పదవుల్లో 9 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కేటాయించామని సీఎం అన్నారు.నామినేటెడ్ పదువుల్లో వెనకబడ్డ వర్గాలకు పెద్దపీట వేశామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక లక్షా 20 వేల శాశ్వత ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 92 శాతం కార్పొరేషన్ ఛైర్మన్ పదవులిచ్చామని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పదవులను 73 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే ఇచ్చామని తెలిపారు. 58 శాతం నామినేటెడ్ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వార్గాలకే ఇచ్చామని సీఎం అన్నారు. 51 వేల ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశామని సీఎం జగన్ తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చాక లక్షా 84 వేల కొత్త ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇబ్బంది ఉండొద్దని కార్పొరేషన్ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రభుత్వంపై రూ.3600 కోట్ల భారం పడినప్పటికీ విలీనం చేశామని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఆశావర్కర్లకు రూ.3000 జీతమని, తమ ప్రభుత్వం వచ్చాక ఆశావర్కర్లకు జీతం రూ.పదివేలకు



పెంచామని తెలిపారు. ఈనాడు రామోజీరావుకు ఈ వాస్తవాలు కనిపించవా? అని సీఎం వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు. ఎర్రజెండాలు, పచ్చజెండాలు కలిపి ఉద్యోగులను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు.ఉద్యోగుల సమ్మె జరుగుతుందంటే ఎల్లోమీడియాకు పండగ అని సీఎం జగన్ అన్నారు. సంధి జరిగింది.. ఉద్యోగులు సమ్మెకు వెళ్లడంలేదని వారికి మంట అని అన్నారు. ఉద్యోగులు సమ్మె విరమించారనగానే కమ్యూనిస్టులను ముందుకు తోశారని మండిపడ్డారు. చంద్రబాబు ఎల్లోమీడియాకు మాత్రమే సమ్మె కావాలని ఎద్దేవా చేశారు. సీఎంను తిడితే ఇంకా బాగా కవరేజ్ ఇస్తారని అన్నారు. ఎస్సీ కులంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అన్న వ్యక్తి.. రామోజీరావుకు ముద్దుబిడ్డగా ఉన్నారని మండిపడ్డారు. బీసీల తోకలు కత్తిరిస్తానన్న వ్యక్తి ఏబీఎన్ రాధాకృష్ణ చంద్రబాబు ఆత్మీయుడని దుయ్యబట్టారు. బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్రానికి లేఖ రాసిన వ్యక్తి చంద్రబాబు అని సీఎం జగన్ అన్నారు. పేదల ఇళ్లను అడ్డుకున్న వ్యక్తి కామ్రేడ్లకు ఆత్మీయుడు అని విమర్శించారు.

## మరో రూ.27 వేల కోట్ల అప్పు జగన్ అడిగారు: కేంద్ర ఆర్థికశాఖ

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి నాటికి మరో రూ.27 వేల కోట్లు అప్పులు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ అనుమతి కోరందని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. బహిరంగ



మార్కెట్లో రూ.27 వేల కోట్లు అప్పు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ విజ్ఞప్తి చేశారని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. 2021- 22 సంవత్సరానికి గాను రూ. 27,325.78 కోట్ల అప్పులు బహిరంగ మార్కెట్లో చేసేందుకు రాజ్యాంగంలోని 293(3) నిబంధన కింద అనుమతి ఇవ్వాలని.. డిసెంబర్ నెలలో జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. జగన్ విజ్ఞప్తి మేరకు కేంద్రాన్ని కోరామని ఆర్థిక శాఖ తెలిపింది. బహిరంగ మార్కెట్లో అప్పులు చేసేందుకు 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను వున్న పరిమితిని రూ.42,472 కోట్లకు పెంచాలని జగన్ కోరారని ఆర్థిక శాఖ పేర్కొన్నారు.

## 4 నుంచి 17 వరకు ఏపీ అసెంబ్లీ

విజయవాడ, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్)ఏపీలో మార్చి తొలివారంలో బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి 4 లేదా 7న బడ్జెట్ సమావేశాలను ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కొత్త రాజధాని ఏర్పాటు, కొత్త జిల్లాలపై ప్రత్యేక బిల్లులను ప్రభుత్వం తీసుకురానున్నట్లు సమాచారం. ఉగాది నుంచి కొత్త జిల్లాలలో పరిపాలనను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో.. ఉగాదికి ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో ఈలోపు అసెంబ్లీ, శాసనమండలి బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకోవడంపై జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది.అయితే బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షం టీడీపీ హాజరవుతుందా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. గత అసెంబ్లీ సమావేశాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు తనను, తన భార్యను అసభ్య పదజాలంతో దూషించారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు సభ నుంచి వాకౌట్ చేసి వెళ్ళిపోయారు. మళ్ళీ అధికారంలోకి వచ్చాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలకు టీడీపీ సభ్యులు హాజరుకావడం అనుమానంగా మారింది.

## 8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి: విజయ సాయిరెడ్డి

రాజ్యసభలో ప్రభుత్వానికి ఎంపీ విజయసాయి రెడ్డి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతుందని రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ రంగాలలో భర్తీ చేయని ఉద్యోగ ఖాళీలు లక్షల సంఖ్యకు చేరుకుంటున్నాయని, ఇది చాలా విచిత్రమైన పరిస్థితి తెలిపారు. రాజ్యసభలో మంగళవారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలో భర్తీకాని ఉద్యోగ ఖాళీల గురించి ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం 8 లక్షల ఉద్యోగ ఖాళీలు నేటికీ భర్తీ కాలేదని అన్నారు. ఇందులో సైన్యంలోని త్రివిధ దళాల్లో లక్షకు పైగా ఉద్యోగాలు, రైల్వేలో 2 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.కేంద్ర ప్రభుత్వంలోని వివిధ ఉద్యోగ ఖాళీల ప్రకటన, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అసాధారణ జాప్యంతోపాటు రిక్రూట్‌మెంట్ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలు ప్రకటించడంలోను, నియామక ప్రక్రియను పూర్తి చేయడంలో కూడా తీవ్ర జాప్యం చేసుకుంటోందని అన్నారు. అలాగే రిక్రూట్‌మెంట్ ప్రశ్నా పత్రాలు లీక్ కావడం, వివిధ రిక్రూట్‌మెంట్ బోర్డుల్లో జరుగుతున్న అవకతవకలపైన కోర్టుల్లో ఏళ్ళ తరబడి కొనసాగుతున్న దావాలు వంటి కారణాలతో ఏడాదిలో పూర్తి కావలసిన నియామక ప్రక్రియ రెండు, మూడేళ్ళు గడిచినా పూర్తి కావడం లేదని విజయసాయి రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో రిక్రూట్‌మెంట్ పరీక్షల కోసం ఏళ్ళ తరబడి రేయింబవళ్ళు కష్టపడుతన్నారని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరి వలన లక్షలాది మంది యువతీ యువకుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతోందని విజయ సాయి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇక్కట్లను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వంలోని వివిధ ఖాళీలను భర్తీ చేయడానికి నిర్దుష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే భవిష్యత్తులో నిర్ణీత కాలవ్యవధిలో అన్ని ఖాళీలను భర్తీ చేయడానికి వీలుగా ఒక పటిష్టమైన విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## దేశంలో 170.21 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ



హైదరాబాద్: దేశంలో కోవిడ్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే భారీ ఎత్తున కోవిడ్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ చేపట్టింది. ఇప్పటి వరకూ 170.21 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన 24 గంటల్లో 55.78 లక్షల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు తెలిపారు. దేశంలో రికవరీ రేట్ 96.46 శాతం కాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా 67,597 కేసులు నమోదయ్యాయి. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 9,94,891 కాగా వీక్లీ పాజిటివిటీ రేట్ 8.30 శాతంగా అధికారులు తెలిపారు.

## ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు కాంగ్రెస్ చాలా అన్యాయం చేసింది

సరైన విధంగా విభజన జరిగి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు
పార్లమెంటులో తలుపులు వేసి, మైక్‌లు కట్ చేసి, బిల్లును ఆమోదించారు
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ ఫిబ్రవరి 8 ఆంధ్ర ప్రదేశ్ విభజన వల్ల ఏర్పాటైన రెండు రాష్ట్రాలు ఇప్పటికీ కష్టాల్లోనే ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు మోదీ మంగళవారం రాజ్యసభలో సమాధానమిస్తూ కాంగ్రెస్ పార్టీపై వ్యంగ్యాస్త్రాలతో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ ఉనికిలో ఉండటం వల్ల ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్నాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు కాంగ్రెస్ అన్యాయం చేసిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌ను కాంగ్రెస్ హడావిడిగా విభజించిందన్నారు. తాము తెలంగాణాకు వ్యతిరేకం కాదన్నారు. విభజన జరిగిన తీరు ఎలా ఉందనేది చాలా ముఖ్యమైన విషయమని వ్యాఖ్యానించారు. తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా విభజించినప్పటికీ, ఆ పార్టీని ప్రజలు నమ్మలేదన్నారు. బీజేపీ అగ్ర నేత అటల్ బిహారీ వాజ్‌పాయి ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో ఎటువంటి వివాదాలకు తావు లేని రీతిలో, శాంతియుతంగా మూడు రాష్ట్రాలను ఇచ్చామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు కాంగ్రెస్ చాలా అన్యాయం చేసిందన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. సరైన విధంగా విభజన జరిగి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. విభజన చట్టంపై ఎలాంటి చర్చలు జరగలేదని చెప్పారు. పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులు పెప్పర్ స్ప్రే వాడారన్నారు. పార్లమెంటులో తలుపులు వేసి, మైక్‌లు కట్ చేసి, బిల్లును ఆమోదించారన్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అహంకారం, అధికార కాంక్షకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. విభజన తీరుతో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు ఇప్పటికీ నష్టపోతున్నాయన్నారు.

## ఆ అవినీతి లేకపోతే 30 శాతం పీఆర్సీ ఇవ్వొచ్చు: అశోక్‌బాబు

అమరావతి: ఉద్యోగుల ఉద్యమం వెనుక టీడీపీ ఉందని సీఎం జగన్ మాట్లాడటం దిగజారుడు తనమని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు అన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై స్పందించిన ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీలు



అమలు చేయకుండా ఉద్యోగ సంఘాల నాయకుల్ని బ్లాక్ మెయిల్ చేసి ఉద్యమాన్ని నీరుగార్చారని విమర్శించారు. నాయకులు స్వార్థం కోసం ఉద్యోగస్తుల్ని మోసం చేయబట్టే.. ఆ జేఏసీల్లో నుంచి ఉద్యోగులంతా బయటకొచ్చి కొత్త జేఏసీలతో ఉద్యమానికి సిద్ధమవుతున్నారన్నారు. ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చమంటే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనటం పచ్చి అబద్ధమన్నారు. 2021 డిసెంబర్ నాటికే రూ. 97 వేల కోట్ల ఆదాయం వచ్చిందని, మార్చి నాటికి రూ. 1 లక్షా 32 వేల కోట్లకు పెరుగుతుందన్నారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ఆదాయం పెరిగిందే తప్ప తగ్గలేదన్నారు. నాడు, నేడు, వైసీపీ రంగులు, ఇళ్ల స్థలాల పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్నారని, ఈ అవినీతి లేకపోతే 30 శాతం పీఆర్సీ ఇవ్వొచ్చునన్నారు. జగన్ ఉద్యోగులకు చేసిన మోసానికి వాళ్లు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటం ఖాయమన్నారు.? ఉద్యోగుల న్యాయబద్ధ పోరాటానికి టీడీపీ అండగా ఉటుందని అశోక్ బాబు స్పష్టం చేశారు.

## ప్రకాశం జిల్లాలో రెండు విషాద ఘటనలు..

ఏడుగురు మృతి

ప్రకాశం జిల్లా: జిల్లాలో ఒకేరోజు రెండు విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. బెస్తవారిపేట మండలం పెంచకలపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో నాలుగు ఆవులు కూడా చనిపోయాయి.ఇదిలా ఉండగా, జిల్లాలోని చినగంజాం మండలం సోపిరాల రైల్వే గేటు సమీపంలో విషాదం చోటుచేసుకుంది. ఓ తల్లి.. ఇద్దరు పిల్లలతో సహా రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతుల వివరాలు తెలియాల్సి వుంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.






# సంపాదకీయం

బుధవారం 09 ఫిబ్రవరి 2022

## రాజ్యాంగంపై వాడీ వేడి చర్చ

దేశంలో రాజ్యాంగం గురించి వాడి, వేడిగా రాజకీయ వర్గాలలో చర్చ మొదలైనది. మొదటగా రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం ఉన్నదని తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పేర్కొనడం రాజకీయ ప్రత్యర్థుల నుండి తీవ్రమైన స్పందనను ఆకర్షించింది. కాకతాళీయంగా ఆమరుసటి రోజుననే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రస్తావించారు.ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎటువంటి అభిప్రాయాలనైనా శాంతియుతంగా వ్యక్తం చేయవచ్చు. వాటి గురించి సమాలోచనలు జరుపవచ్చు. రాజ్యాంగం కూడా అందుకు మినహాయింపు కాదు. స్వయంగా రాజ్యాంగం రచించిన డా. బిఆర్ అంబేడ్కర్ ఈరాజ్యాంగం ఆశించిన విధంగా సామాజిక న్యాయం కలిగించడానికి దోహదపడని పక్షంలో దానిని విసిరి వేయమని సూచించారు. ఏ దేశంలో అయినా రాజ్యాంగం ఆ దేశపు సామాజిక, నాగరిక, రాజకీయ, ఆధ్యాత్మిక విలువలకు ప్రతిరూపంగా ఉంటుంది. ఆ విలువలను పెంపొందించే బాధ్యత పరిపాలకులపై ఉంటుంది. అంతేగాని రాజ్యాంగం ద్వారా అటువంటి విలువలు ఏర్పడవు. ఉదాహరణకు బ్రిటన్‌కు లిఖితపూర్వక రాజ్యాంగమే లేదు. అంతమాత్రం చేత రాజ్యాంగ విలువలు లేని దేశం కాదు అది.కరోనా మహమ్మారి సమయంలో ప్రధాని బోరిస్ జూన్సన్ తన ఇంట్లో విందు చేసుకున్నారని వచ్చిన ఆరోపణలపై స్వయంగా అక్కడి పోలీసులు దర్యాప్తు చేపట్టడం గమనార్హం. మన దేశంలో ఒక ప్రధాని, ముఖ్యమంత్రిలపై సాధారణ పోలీసులు దర్యాప్తు చేయగలరా? అమెరికా రాజ్యాంగం కూడా చాలా చిన్నదే. అయితే దానికి చాలా అరుదుగా సవరణలు చేస్తుంటారు. ప్రపంచంలో మరెవ్వరికీలేని అతి పెద్ద రాజ్యాంగం ఏర్పర్చుకున్నా బహుశా మనం చేసినన్ని సవరణలు మరెవ్వరు చేసి ఉండరు. అంతమాత్రం చేత రాజ్యాంగంలో మార్పులు సూచించడం, మార్చాలని అనడం 'దేశ ద్రోహం' కానేరదు. భారతీయ విలువలను ఇనుమడింపలేదని అంటూ పలు సందర్భాలలో విమర్శలు చేశారు కూడా.రాజ్యాంగం మంచి చెడుల గురించి నేను మాట్లాడను. ఎందుకంటే అమలు చేయడానికి మనం ఎంచుకునే వాళ్లను బట్టి మంచి రాజ్యాంగం చెడుగా మారిపోవచ్చు. అమలు చేసే వాళ్లను బట్టే చెడు రాజ్యాంగం కూడా మంచిగా మారిపోవచ్చు' అని రాజ్యాంగ సభలో తన ముగింపు ప్రసంగంలో డా. అంబేడ్కర్ పేర్కొనడం ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరింప చేసుకొంది|ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో రాజకీయ ఆవేశాలను పక్కన ఉంచితే, కేంద్ర, రాష్ట్ర సంబంధాల గురించి మరోసారి ప్రముఖంగా ప్రస్తావన రావడం గమనార్హం. కేంద్రంలో, రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగినంత కాలం ఈ అంశం పెద్దగా ప్రస్తావనకు రాలేదు. కానీ విభిన్న రాజకీయ పార్టీలు కేంద్రం, రాష్ట్రాలలో అధికారంలో ఉంటున్న సమయంలో, ముఖ్యం గా 1971 తర్వాత కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, అధికార పరిధిపై తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. ఈ సమస్యను జాతీయ స్థాయిలో ప్రముఖంగా లేవనెత్తి 'కేంద్రం ఒక మిథ్య' అనే తీవ్రమైన పదజాలాన్ని టిడిపి వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు ఉపయోగించారు. గవర్నర్లు కేంద్రానికి ఏజెంట్లవలే వ్యవహరిస్తున్నారని అంటూ ఆ వ్యవస్థ ఎందుకని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో బిజెపితో సహా దాదాపు అన్ని ఇతర పార్టీలు ఇటువంటి ప్రశ్నలు లేవనెత్తాయి.రాజ్యాంగంలోని మొట్టమొదటి ఆర్టికల్ భారతదేశాన్ని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని పిలుస్తుంది. ఇక్కడ ఆర్టికల్ 1 ఏమి చెబుతోంది?: భారతదేశం, అంటే భారత్, రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుంది. భారత దేశం పాక్షిక– సమాఖ్య ప్రభుత్వాన్ని కలిగి ఉంది. ఉమ్మడి జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలకు బాధ్యత వహించే దేశం మొత్తానికి ప్రభుత్వం. రాష్ట్రాల రోజువారీ పాలనను సవివరంగా చూసుకునే రాష్ట్రాల మధ్య పరిపాలించే అధికారం విభజించబడింది. అయితే రాష్ట్ర ప్రభుత్వాల కంటే కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉన్నాయి.రాజ్యాంగ నిపుణుడు సుభాష్ కశ్యప్ ఒక సందర్భంలో, రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే ఉంచినట్లు చాలాస్పష్టంగా చెప్పారు. తద్వారా రెండు ప్రభుత్వాలు–యూనియన్, రాష్ట్రాల మధ్య సంబంధం అసమానమైనది కాదు. ఈ సందర్భంగా మరో అంశాన్ని గుర్తెరగాలి. మన రాజ్యాంగాన్ని దేశ విభజన జరిగిన ఆందోళనకరమైన పరిస్థితులలో రచించారు. అంతకు ముందు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న నాయకులు దాదాపు అందరూ –మహాత్మాగాంధీ నుండి రాజేంద్ర ప్రసాద్, సర్దార్ పటేల్‌ల వరకు గ్రామ స్వరాజ్, పంచాయత్ రాజ్ సంస్థలకు పాలనలో కీలక పాత్ర ఉండాలని చెబుతూ వచ్చారు.దేశ విభజన సమయంలో పెద్ద ఎత్తున రక్షపాతం జరగడం, లక్షలాది మంది పౌరులు హత్యకు గురికావడం, మరోవంక కాశ్మీర్‌లో పాకిస్థాన్ దండెత్తి కొన్ని భూభాగాలను ఆక్రమించుకోవడం వంటి పరిస్థితులలో దేశ సమగ్రత, రక్షణ అంశాలు ప్రాధాన్యత సంతరించుకొని, బలమైన కేంద్రం ఉండే విధంగా రాజ్యాంగం రూపొందించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ వంటి వారు లేవనెత్తిన పలు అభ్యంతరాలను తర్వాత మార్చుకొందాం అంటూ జవహర్ లాల్ నెహ్రూ దాట వేశారు. అయితే గత 70 ఏళ్లుగా కేంద్రంలో ఎవ్వరు అధికారంలో ఉన్నప్పటికీ 'సహకార సమాఖ్య' స్వరూపానికి తూట్లు పొడుస్తూ వస్తున్నారు. ముఖ్యంగా ఇందిరా గాంధీ హయాం నుండి గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా మారు తూ, వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్నా రు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు రాజ్యాంగ సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ ఎక్కువగా అధికార కేంద్రీకరణకు ప్రయత్నం చేస్తూ, రాష్ట్రాల ఆర్థిక వనరులను, అధికారాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతూ వస్తున్నాయి. ఈ విషయమై గతంలో బిజెపి సహితం పలు సందర్భాలలో తన తీర్మానాలలో ఆందోళన వ్యక్తం చేస్తూ, రాష్ట్రాల వనరులు, అధికారాల పరిధి గురించి ప్రస్తావించింది. ఉదాహరణకు జిఎస్‌టి ని స్వాతంత్ర్యం అనంతరం తీసుకొచ్చిన అతిపెద్ద పన్నుల సంస్కరణగా పేర్కొంటున్నారు. కానీ అది రాష్ట్రాల ఆర్థిక వనరులను, నిర్ణయాధికారాలను నిర్వీర్యం చేసేందుకే దారితీస్తుంది.రాష్ట్రాలలో విస్తృతమైన వాణిజ్య పన్నుల విభాగాలు ఉన్నాయి. ఇప్పుడు అవి పని లేకుండా ఉండిపోయాయి. కేంద్రానికి అటువంటి వ్యవస్థ లేదు. దానితో అన్ని పనులను ప్రైవేట్ వారితో జరిపిస్తున్నారు. దానితో లెక్కలేనన్ని అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతున్నది. 'భిన్నత్వంలో ఏకత్వం' భారత దేశపు బలంగా, విలక్షణమైన సంస్కృతిగా మనం గర్వంగా చెప్పుకొంటుంటాము.

## రాజ్యాంగేతర శక్తిగా సజ్జల..?



విజయవాడ, ఫిబ్రవరి 8, ఎవరైనా తాము ప్రేమించి, నమ్మిన వ్యక్తిని టార్గెట్ చేస్తే అది ఆ వ్యక్తికే ఉపయోగమవుతుంది. రాజకీయాల్లో అయితే ఖచ్చితంగా ఇది జరిగి తీరుతుంది. చంద్రబాబు కాని జగన్ కాని, తమ మనుషులు అనుకున్న వారిని పదే పదే విమర్శిస్తుంటే ఆ నేతను మరింత దగ్గరకు తీసుకుంటారు. జగన్ కూడా అంతే. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో జగన్ ఊహించని ట్విస్ట్ ఇస్తారంటున్నారు. అవును అందరూ అంటుందే జగన్ చేసేస్తారట.సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కు అత్యంత ఇష్టుడు. నమ్మకమైన వ్యక్తి. వ్యక్తి అని ఎందుకు అనాల్సి వస్తుందంటే ఆయన నేత కాదు. నమ్మకమైన మిత్రుడు అంతే. ఆయన స్వతహాగా జర్నలిస్టు. రాజకీయ అవగాహన ఉన్నా ఎప్పుడూ ఆయన దాని జోలికి పోలేదు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నా విపక్షంలోనూ సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర కొంత వరకే. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సజ్జల ప్రాముఖ్యత పెరిగింది. ఏది చేయాలన్నా, ఏది వినిపించాలన్న సజ్జల చేతుల మీదగా, నోటి ద్వారానే చెప్పిస్తారు. ఇది అందరికీ తెలిసిందే. అయితే ఇటీవల ఉద్యోగ సంఘాల చర్చల సందర్భంగా కూడా సజ్జల రామకృష్ణారెడ్డిని మంత్రుల కమిటీలో జగన్ చేర్చారు. అంతకు ముందు కూడా ప్రభుత్వ సలహాదారు హోదాలోనే ఆయన ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపారు.

ఎప్పుడైతే చర్చలు బెడిసికొట్టాయో అప్పుడు ఉద్యోగ సంఘాలు కూడా సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేశాయి. ఆయనను రాజ్యాంగేతర శక్తిగా చెబుతున్నాయి. ఇక విపక్షాల కన్ను మొత్తం సజ్జల పైనే ఉంది. ఉద్యోగ సంఘాల ఆందోళనలోనూ జగన్ ఆలోచనలనే సజ్జల అమలు పర్చారు. మొత్తానికి సమ్మె విరమణ జరిగినా సజ్జల మాత్రం అందరికీ లక్ష్యమయ్యారు.. నిన్న మొన్నటి వరకూ సజ్జల రామకృష్ణారెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలా? వద్దా? అని ఆలోచిస్తున్న జగన్ ఖచ్చితంగా తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారని తెలిసింది. వచ్చే మంత్రి వర్గ విస్తరణలో సజ్జలకు చోటు ఉంటుందని చెబుతున్నారు. మంత్రిగా చేసి ప్రత్యర్థుల నోళ్లు మూయించాలన్నది జగన్ ఆలోచనగా ఉందంటున్నారు. ఉద్యోగ సంఘాల ఆందోళన తర్వాతనే ఈ ఆలోచన జగన్ లో మరింత బలపడినట్లు తెలిసింది. మొత్తం మీద సజ్జల రామకృష్ణారెడ్డికి జగన్ కు ఊహించని గిఫ్ట్ ఇస్తున్నారని పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది.

## ఆర్థిక సంఘం నిధులు...ఎప్పుడు

నెల్లూరు, ఫిబ్రవరి 8, ) రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకున్న 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం గ్రామ పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి. కేంద్రం నుంచి నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమైన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రెండున్నర వేల కోట్లను ప్రభుత్వం గతేడాది తన ఖాతాకు మళ్లించుకుంది. దీంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆటంకం కలుగుతోంది. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతి ఏడాదీ కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్‌తోపాటు గ్రామ పంచాయ తీలకు కూడా ఆ నిధులు మంజూరవుతాయి. అందులో పంచాయతీలకు 70 నంచి 85 శాతం, మండలాలకు 10 నుంచి 25, జిల్లా పరిషత్‌కు ఐదు నుంచి 15 శాతం మేర నిధులు మంజూరవుతాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆ నిధులను ప్రభుత్వం బదిలీ చేసుకునే అధికారం లేదు. విద్యుత్ బిల్లుల సర్దుబాటు పేరుతో అన్ని పంచాయతీల బ్యాంకు ఖాతాలనూ ప్రభుత్వం జీరో చేసింది. దీనిపై గతేడాది నవంబరులో సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖతాను తెరవాల్సి ఉండగా, రాష్ట్రంలో అలాంటి విధానం లేకపోవడంతో, నిధులన్నీ పంచాయతీ ఖాతాలోనే జమకావడం, తరచూ ప్రభుత్వం వాటిని బదలాయించుకోవడం జరుగుతోంది. దీనిపై ప్రజా ప్రతినిధుల నుంచి వ్యతిరేకత రావడంతో, ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు అన్ని పంచాయతీలూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేకంగా ఖాతాలను ఓపెన్ చేశాయి. మండల, జిల్లా పరిషత్ అధికారులు సైతం ప్రత్యేకంగా బ్యాంకు ఖతాలు తెరిచారు. అయినప్పటికీ ప్రభుత్వం బదలాయించుకున్న నిధులను వెనక్కి వేయలేదు.ఆర్థిక సంఘం నిధులు వస్తాయనే ఆశతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ పాలకవర్గాలు స్థానికంగా కొన్ని పనులు చేశాయి. బ్యాంకు ఖాతాల్లో నిధులు లేకపోవడంతో బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది. అలాగే కొత్తగా మౌలిక వసతుల కల్పనకు ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, మంత్రులను సర్పంచులు కలిసి ఆర్థిక సంఘం నిధులను తమ ఖాతాలకు మళ్లించాలని కోరినా ఫలితం శూన్యంగానే ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే వేసవి ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు కూడా నిధులు లేవని పంచాయతీ కార్యదర్శి ఒకరు తెలిపారు. ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వస్తే, కొత్త పనులు చేపట్టాలని భావిస్తున్నామన్నారు.

## చేపల చెరువుగా మారిన ఆర్ అండ్ బీ రోడ్డు

ఏలూరు, ఫిబ్రవరి 8. చేపల చెరువుల యజమానుల దురాగతాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. వేలాది మంది ప్రజానీకం నడిచే ఆర్‌అండ్‌బి రోడ్డును సైతం చేపల చెరువుల గట్టుగా మార్చేస్తున్న పరిస్థితి నెలకొంది. పంట కాలువల్లోకి విచ్చలవిడిగా చేపల చెరువుల నీటిని వదిలేస్తుండటంతో వందల ఎకరాల భూముల్లో రబీలో వరి నాట్లు వేయలేని దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులు, ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.మండల కేంద్రం నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లేందుకు మూడు కిలోమీటర్ల ఆర్‌అండ్‌బి రహదారి ఉంది. దశాబ్దకాలంగా ఈ రోడ్డు వేయకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. నిడమర్రు గ్రామశివారు నుంచి ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపులా చేపల చెరువుల తవ్వకాలు జరిగాయి. నిబంధనల ప్రకారం అర్‌అండ్‌బి రహదారిని ఆనుకుని చెరువు తవ్వకాలు చేయాలంటే రోడ్డుకు పదిమీటర్లు ఖాళీ వదిలి చేపల చెరువు గట్టు వేయాల్సి ఉంటుంది. నిడమర్రు నుంచి అడవికొలను వెళ్లే దారిలో చేపల చెరువుల తవ్వకందారులు నిబంధనలు పూర్తిగా పక్కనపెట్టేశారు. మొదట్లో చెరువు తవ్వకం జరిపినప్పుడు కొద్దిమేరే ఖాళీ వదిలారు. అయినప్పటికీ అధికారులు ఏఒక్కరూ పట్టించుకోలేదు. ఇప్పుడు చెరువు రీమోడలింగ్ పేరుతో మరోసారి తవ్వకం చేశారు. ఈసారి మట్టిని మొత్తం ఆర్‌అండ్‌బి రహదారిపై వేసి రోడ్డునే గట్టుగా మార్చేసిన పరిస్థితి నెలకొంది. రోడ్డుకు పక్కగా వేసిన కరెంటు స్తంభాలు సైతం గట్టులో కలిసిపోయాయి. ఈ రోడ్డుగుండా నిత్యం నాలుగైదువేల మంది రాకపోకలు సాగిస్తుంటారు.వర్షాకాలం వస్తే ఆ మట్టి కరిగి రోడ్డుపైకి వస్తే నడిచేందుకు వీలుండదని జనం లబోదిబోమంటున్నారు. అడవికొలను వెళ్లేందుకు తహశీల్దార్, ఎంపిడిఒ, ఆర్‌అండ్‌బి అధికారులు, విఆర్‌ఒలు అంతా ఈ రోడ్డుగుండానే నిత్యం వెళ్తుంటారు. అయినఏఒక్కరూ పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో చెరువుల యాజమాన్యం నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టేసి రోడ్డునే గట్టుగా మార్చేశారు. వేలాది మంది నడిచే ఆర్‌అండ్‌బి రోడ్డునే ఈ విధంగా కలిపేయడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు పది మీటర్ల వరకూ ఖాళీ చేయించి రోడ్డును కాపాడాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బి డిఇ డిఎం.కోటేశ్వరరావును వివరణ కోరగా తన దృష్టికి విషయం రాలేదని, సిబ్బందిని పంపించి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.చేపల చెరువుల యజమానుల ఆగడాలు శృతిమించిపోతున్న పరిస్థితి నెలకొంది. చేపల చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా

రొయ్యల సాగు చేయడం, ఇష్టానుసారంగా ఉప్పునీటి బోరు తవ్వకాలు సాగించేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రబీ సాగు ఆరంభమయ్యాక రైతులు నారుమడులు వేసి నాట్లకు సిద్ధమవుతుండగా, చేపల చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. దీంతో నిడమర్రు మండలం అడవికొలనులో వందకెరాలకుపైగా సాగుభూమిలో రబీ నాట్లు వేయకుండా వదిలేసిన పరిస్థితి నెలకొంది. భూములన్నీ కొల్లేరుకు ఆనుకుని ఉన్న చిన్న, సన్నకారు రైతుల భూములే. ఇష్టానుసారంగా చేపల చెరువుల్లోని నీటిని వదిలేయడంతో పొలాల్లోకి నీరు చేరి నాట్లు నాటేందుకు వీల్లేకుండాపోయింది. దీంతో రైతులంతా లబోదిబోమంటున్నారు. ఇప్పటికే రైతులు నారుమడులు, పొలం బాగు చేయించడానికి ఎకరాకు రూ.మూడు వేలకుపైగా ఖర్చు చేసిన పరిస్థితి నెలకొంది. చేపల చెరువుల్లోని నీటిని ఇష్టానుసారంగా పంటకాలువల్లోకి వదిలేయకుండా చర్యలు తీసుకోకపోతే ముందుముందు పంట పొలాలన్నీ బీడుబీములుగా మారిపోయే పరిస్థితి రానుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

## కొత్త పథకాల కోసం సర్వే

విశాఖపట్టణం, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాలు అందుకునే లబ్ధిదారులపై కొత్త సర్వే ప్రారంభం కానుంది. ఇప్పటివరకు నిర్వహించిన సాధికారత సర్వే స్థానంలో దీనిని నిర్వహించనున్నారని సమాచారం. మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో దీనిని నిర్వహించనున్నట్లు సమాచారం. కొత్త సర్వే నిర్వహణపై సచివాయాల కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిసింది. పథకాలు అందుకుంటున్న వారిలో అనర్హులు ఎక్కువగా ఉన్నట్లు గతం నుంచి అధికారులు చెబుతున్నారు. ఆస్తులు ఉన్న వారు కూడా ఈ పథకంలో లబ్ది పొందుతున్నట్లు వారంటున్నారు. ఈ నేపథ్యంలోనే మొత్తం వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. లబ్ధిదారుల ఇళ్లకు కార్యదర్శులు, వాలంటీర్లు వెళ్లి వారి వివరాలు సమూలంగా సేకరించాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా వారికున్న భూములు, దేనికైనా పన్నులు చెల్లిస్తున్నారా, వారు వినియోగిస్తున్న విద్యుత్ వివరాలు సేకరించనున్నారు. లబ్ధిదారుల ఇళ్లలో అద్దెకు ఎవరైనా ఉంటున్నారా, ఆ ఇళ్లలో ఎన్ని విద్యుత్ మీటర్లు వినియోగిస్తున్నారన్నది కూడా సేకరించనున్నట్లు తెలిసింది. ఒక వేళ ఒకటికన్నా ఎక్కువ మీటర్లు ఉన్న వాళ్లు, వాటిపై ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే తమ పరిధిలోని విద్యుత్ శాఖ ఏఇ వద్దకు వెళ్లి వాటిని తొలగించుకోవాల్సి ఉంటురది. ఇదే సమయంలో భూమి ఉరటే ఎరత ఉరది, అది సాగుభూమా, నివాస భూమా అన్నది చెప్పాల్సి ఉరటుంది. ఉన్నా పథకాల కోసం లేదని చెబితే ఆ విషయాన్ని యాప్‌లో పొందుపరిచి, లబ్దిదారుల వేలిముద్ర తీసుకుంటారు. ఇదే సమయంలో లేదని చెప్పిన వారికి భూమి ఉన్నట్లు తరువాత కాలంలో తేలితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెబుతున్నారు. ఈ సర్వే నిర్వహణ బాధ్యతలను రెవెన్యూ, ప్రణాళిక, ఆర్థిక, ఐటి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖలపై ఉంటుందని సమాచారం. ఈ సర్వే ప్రారంభమయ్యాక ఆయా శాఖల అధికారులు సమాచారాన్ని క్రోడీకరించి, నిజమైన లబ్దిదారులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిసింది. ఈ సర్వేను వాస్తవంగా ఫిబ్రవరి నెల్లోనే ప్రారంభించాలని ఆలోచన చేసినప్పటికీ యాప్‌లో తలెత్తిన కొన్నిసాంకేతిక సమస్యల కారణంగా మార్చి, ఏప్రిల్ నెలలకు వాయిదా వేసినట్లు తెలిసింది.

## రేపల్లె పోలీసు స్టేషన్ ను తనిఖీచేసిన రూరల్ ఎస్పీ

గుంటూరు రేపల్లె పోలీస్ స్టేషన్ లో రూరల్ ఎస్పీ విశాల్ గున్నీ ఆకస్మిక తనిఖీలు చేసారు. రూరల్ ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ లో పలు రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించు వద్దు. సమస్య జరిగినప్పుడు ప్రజలు వెంటనే స్టేషన్కు తెలియపరచాలి. అసాంఘిక కార్యక్రమాలు మీద సిబ్బంది ఫోకస్ పెట్టాలి. మహిళల కేసుల్లో వెంటనే స్పందించమని అధికారులకు సూచించారు. ఏ సమస్య వున్నా నా నెంబర్ కి ఫోన్ చేసినా స్పందిస్తానని అన్నారు.

## 10 వేలు దాటిన తెల్లబంగారం

కర్నూలు, ఫిబ్రవరి 8, ()పత్తి ధరలు రోజు రోజుకు భారీగా పెరుగుతున్నాయి. తాజాగా కర్నూలు జిల్లాలో పత్తి ధర ఆల్ టైమ్ రికార్డ్ స్థాయికి చేరింది. పత్తి వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీని కారణంగానే పత్తి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఉ బళ్లారి, రాయచోటి తదితర ఏడు జిల్లాలకు ప్రధాన కేంద్రమైన ఆదోని కాటన్ మార్కెట్ లో చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ధరలు పెరిగాయి. క్వింటాల్ పత్తి ధర పదివేల రూపాయలు దాటి రూ. 10,759 పలికింది. సీజన్ చివరి దశకు చేరుకుంటుండటం.. వ్యాపారుల మధ్య పోటీ పెరగడం, సప్లై తగ్గి డిమాండ్ పెరగడం

కారణంగా ధరలు భారీగా పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో కరువు సీమలో రైతుకు కొంత ఊరట కలిగిస్తోంది. పత్తికి భారీ స్థాయిలో ధర పలుకుతుండటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కాగా, ఈ సీజన్‌లో పత్తి దిగుబడులు బాగా తగ్గాయి. దీంతో అంతర్జాతీయంగా డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా పత్తికి అనూహ్యంగా ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అదోని మార్కెట్‌లో పత్తికి రికార్డ్ స్థాయిలో ధర పలికింది. దీంతో పత్తి పండించే రైతులకు మంచి రోజులు వచ్చాయంటూ మురిసిపోతున్నారు రైతులు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి ధర పెరుగుతూ వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బేళ్లకు, గింజలకు మంచి డిమాండ్ ఉండటంతో పోటీ పడి మరీ ఎంత ధరకైనా పత్తిని కొనుగోలు చేస్తున్నారు వ్యాపారులు. వారం నెల రోజుల వ్యవధిలోనే క్వింటాల్ పత్తి 8,500 రూపాయల నుంచి రూ. 10 వేలు దాటింది. ఇలానే కొనసాగితే క్వింటా పత్తి ధర 11 వేలకు చేరే ఛాన్స్ ఉందని చెబుతున్నారు అధికారులు.

## రఘురామ యూ టర్న్...?

ఏలూరు ఫిబ్రవరి 8, )రఘురామ తూచ్ అన్నారు. రాజీనామాపై యూటర్న్ తీసుకున్నారు. తనదైన స్టైల్‌లో తప్పించుకున్నారు. తనపై అనర్హత వేటు వేయించడానికి ఫిబ్రవరి 11 వరకూ గడువిచ్చానని మరోసారి గుర్తు చేశారు. ఆ లోగా వేటు వేయిస్తే సరేసరి. లేదంటే.. తానే రాజీనామా చేస్తానని గతంలో చెప్పిన ఆయన.. ఇప్పుడు మాత్రం కాస్త తిరకాసు పెట్టారు. అనర్హత వేటు వేయించడం తన వల్ల కాదని జగన్ ఒప్పుకుంటే.. అప్పుడు తాను రాజీనామా చేస్తానని కొర్రీ పెట్టారు. అది అయ్యే పని కాదు.. రఘురామ రాజీనామా చేయరని అంటున్నారు. ఇంతకీ రఘురామ స్టాండ్‌లో మార్పుకు కారణం ఏంటి? వ్యూహాత్మకమా? భయమా?వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామ అన్నంత పని చేస్తారు. ఆయన రాజీనామాతో నరసాపురంకు ఉప ఎన్నికలు వస్తాయని భావించారంతా. సర్వేలతో అంతా ప్రజానాడి పసిగట్టే పనిలో పడ్డారు. బై ఎలక్షన్ జరిగితే.. తాను 3 లక్షలకు పైగా మెజార్టీతో గెలుస్తానని రఘురామా ధీమాగా ఉన్నారు. సర్వేలు, లెక్కలతో రెడీగా ఉన్నారు. కానీ, అంతలోనే ఏమైందో ఏమోగానీ.. రాజీనామాపై ఆయన తిరకాసు పెట్టారు. అయితే, తానే స్వయంగా రాజీనామా చేస్తే అంతగా సానుభూతి కలిసిరాకపోవచ్చని.. అదే వేటు వేయించుకుంటే.. సింపతీ కొట్టేయొచ్చనేది రఘురామ స్కెచ్‌గా కనిపిస్తోందని అంటున్నారు. ఇప్పటికే స్పీకర్ ఈ అంశాన్ని ప్రివిలేజ్ కమిటీకి ఫార్వర్డ్ చేశారు. ఆ నివేదిక రాగానే అటోఇటో తేల్చేసే ఛాన్సెస్ ఎక్కువగానే ఉన్నాయంటున్నారు. అయితే, అందుకు మరికొంత కాలం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. వేటు పడకపోతే నో ప్రాబ్లమ్. ఎప్పటిలానే ఎంపీగా ఢిల్లీలో ఉంటూ.. రచ్చబండతో రోజూ జగన్ అండ్ కో ను కుమ్మేయొచ్చు. నిత్యం పబ్లిక్ టాక్‌లో ఉండొచ్చు. అదే, అనర్హత వేటు పడితే.. ఇక ఎలాగూ తప్పదు కాబట్టి ఉప ఎన్నికల్లో అటోఇటో తేల్చేసుకోవచ్చు. ఎలాగూ అమరావతి ఎజెండా ఉండనే ఉంది. బీజేపీ టికెట్ కోసం గట్టిగా ట్రై చేస్తున్నారు. ఇస్తే ఓకే. బీజేపీ, జనసేన పొత్తు ఉంది కాబట్టి.. అటు జనసైనికుల ఓట్లూ తనకు కలిసివస్తాయి. అమరావతి రెఫరెండం కాబట్టి.. టీడీపీ సైతం తనకే మద్దతు ఇచ్చే అవకాశం మెండు. ఒకవేళ బీజేపీ టికెట్ రాకపోతే.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగడం.. వైసీపీ మినహా అన్నిపార్టీల సపోర్ట్ సమీకరించడం.. సార్వత్రిక ఎన్నికలకు ముందు నరసాపురం బై ఎలక్షన్‌తో జగనన్నకు ఝలక్ ఇవ్వడం.. ఇదే రఘురామ పొలిటికల్ ఎజెండా అంటున్నారు. అన్నీ ఆయన అనుకున్నట్టే అయితే ఓకే. కాకపోతేనే.....!!

## ఏపీ వ్యాప్తంగా టీచర్లు ఆందోళన బాట

విజయవాడ, ఫిబ్రవరి 8, (పీఆర్సీని వ్యతిరేకిస్తూ ఏపీ వ్యాప్తంగా టీచర్లు ఆందోళన బాట పట్టారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. కొత్త పీఆర్సీ వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఆర్‌ఏ కనీస శ్లాబు 12శాతానికి పైగా ఉండాలని డిమాండ్ చేశారు. దశలవారీ పోరాటాలకు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. పీఆర్సీ సాధన కమిటీ చేతులెత్తేసినా.. ఉపాధ్యాయులు మాత్రం పీఆర్సీపై తగ్గేదేలేదంటూ ఉద్యమిస్తున్నారు. కమిటీ నేతలు తమకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడుతున్నారు. పీఆర్సీ జీవోల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని ఉపాధ్య సంఘాల నాయకులు చెబుతున్నారు. 'చలో విజయవాడ'ని ఉపాధ్యాయులు దిగ్విజయం చేశారని గుర్తు చేశారు. విజయవాడ, విశాఖలో అద్దెలు అధికంగా ఉన్నాయని చెప్పారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నాయకులు భవిష్యత్‌లో ఉద్యమాలు చేస్తే తాము నమ్మే పరిస్థితి లేదని టీచర్లు తేల్చి చెబుతున్నారు. ఫిట్‌మెంట్ 27శాతం ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. సీపీఎస్ రద్దుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరుకానున్నారు. శుక్రవారం కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు.మరోవైపు, కలెక్టరేట్ల దగ్గర నిరసనలకు ఒప్పంద, పొరుగుసేవల సిబ్బంది ఐకాస పిలుపునివ్వగా.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలో పలు చోట్ల కాంట్రాక్టు ఉద్యోగ నాయకులను గృహనిర్బంధం చేశారు.

## అరసవల్లిలో రథసప్తమి వేడుకలు ప్రారంభం

శ్రీకాకుళం ప్రత్యక్ష దైవం, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి సూర్య జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకలు సోమవారం అర్ధరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నేడు సూర్య భగవానుడు భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నాడు. ఆదిత్యునికి తొలి పూజ, క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామికి తొలి పూజ చేసే అవకాశం రావడాన్ని గొప్ప అదృష్టంగా భావిస్తున్నామని, రథసప్తమి రోజు కలియుగ ప్రత్యక్ష దైవాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నానన్నారు.కలియుగ ప్రత్యక్ష దైవం అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి.

## టిప్పర్, సుమో ఢీకొనడంతో చెలరేగిన మంటలు...డ్రైవర్ సజీవదహనం

చిత్తూరు చిత్తూరు జిల్లాలోని పలమనేరు మండలం గొల్లపల్లి వద్ద కుప్పం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు సజీవదహనం అయ్యారు. టిప్పర్, సుమో పరస్పరం ఢీకొనడంతో రెండు వాహనాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సుమో డ్రైవర్ వాహనంలో ఇరుక్కొని మంటల్లో సజీవ దహనమయ్యాడు. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. సుమోలో ఒక్కరే వున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమోలోని వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సూర్యప్రభవాహనంపై శ్రీ మన్నారాయణుడు

### తిరుమలలో శాస్త్రోక్తంగా రథసప్తమి

తిరుమల సూర్య జయంతిని పురస్కరించుకొని మంగళవారంనాడు తిరుమలలో 'రథసప్తమి' ఉత్సవాన్ని టిటిడి శాస్త్రోక్తంగా నిర్వహించింది.రథసప్తమి వాహనసేవల్లో అత్యంత ప్రధానమైనది సూర్యప్రభవాహనం. ఈ ఏడాది శ్రీవారి ఆలయంలోని ధ్వజ మండపం ముందు శ్రీమలయప్పస్వామివారిని సూర్యప్రభవాహనంపై వేంచేపు చేశారు. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.43 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరించి అంజలి ఘటించాడు.సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు.ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

## వైభవంగా శారదాపీఠం వార్షికోత్సవాలు

విశాఖపట్నం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ శారదాపీఠం వార్షి కోత్సవాలు వైభవంగా జరుగుతున్నా యి.ఈ నెల 11వ తేదీ వరకు ప్రత్యేక ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసా గుతున్నాయి.ప్రధానంగా శ్రీ శారదా స్వరూప రాజ శ్యామల దేవి యాగం లోకకల్యాణార్థం నిర్వహిస్తున్నారు. శ్రీ శారదా పీఠాధిపతి స్వామి స్వరూపా నందేంద్ర సరస్వతి,ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణ లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసా గుతున్నాయి.వార్షికోత్సవం సందర్భం గా శారదా పీఠం లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొలి రోజు గణపతి హోమం తో పాటు రాజ శ్యామల దేవి యాగం దేశ రక్షణ కోసం నిర్వహిం చా రు.రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలతో పాటు పండితులతో సూర్యారాధన జరిగింది.విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించిన బీజేపీ ఏపీ అధ్యక్షులు సోము వీర్రాజు, ఎమ్మె ల్సీ పీవీఎన్ మాధవ్ పీఠం వార్షికోత్స వాల్లో పాల్గొని రాజశ్యామల అమ్మవా రిని దర్శించుకున్నారు.అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్రను కలిసి ఆశీస్సులు అందుకున్నారు.

## విశాఖలో రథ సప్తమి వేడుకలు

విశాఖపట్నం విశాఖలో రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఎంవిపి కాలనీ గాదిరాజు ప్యాలస్ లో ఓం యోగ కేంద్రం ఆధ్వర్యంలో 108 సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించింది. సుమారు 200 మందికి పైగా.. ఈ కార్యక్రమంలో పాల్గొని సూర్య నమస్కారాలు చేశారు.. సూర్యనమస్కారాల వల్ల ఆరోగ్యం.. ఆయుష్ లభిస్తుందని యోగా గురువు రమేష్ చెప్పుకొచ్చారు.రోజులో ఒక గంట యోగాసనాలు కేటాయించాలని కోరారు. అనంతరం చిన్నారులు వివిధ క్లిష్టమైన యోగసనాలను ప్రదర్శించారు..ఈ సూర్య నమస్కారాల కార్యక్రమంలో జిల్లా యోగా గురువు రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు సాగి విశ్వనాథ్ రాజు, బిజేపీ విశాఖ పార్లిమెంట్ అధ్యక్షుడు రవీంద్రలు పాల్గొన్నారు

## "పెదపాడు" లో దాహోర్తి సమస్య తీర్చాలి

### గిరిజన సంఘం

విశాఖపట్నం డుంబ్రిగూడ మండలంలోని పోతంగి మేజర్ పంచాయతీ పరిధిలో గల పెదపాడు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ. సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించి గిరిజనుల నుండి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతనీగి పంచాయితీ పరిధిలో ఉన్న పెదపాడు గ్రామం లో సుమారు 400 మంది పి టి జి ఆదివాసులు నివసిస్తున్నారని ఆయన చెప్పారు. అయితే ఇప్పటికీ గ్రామంలోని సరైన తాగునీటి సౌకర్యం లేదని ఆయన తెలిపారు. కొండవాగు లనుండి ప్రవహించే నీటిని ఉపయోగిస్తున్నారని, ఫలితంగా ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దిక్కులేని ఆ గ్రామ పి టి జి ఆదివాసులు మరోమార్గం లేక ఆ కలుషిత నీటిని ఇప్పటికీ ఉపయోగిస్తున్నారని, అయితే వేసవి సమిపిస్తే ఆ నీరు కూడా దొరకలేని దౌర్భాగ్య పరిస్థితిలో గిరిజన జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచాయితీ, మండల స్థాయి అధికారులకు ప్రజాప్రతినిధులకు, వినతులు సమర్పిస్తున్న ప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆయన తెలిపారు. తక్షణమే పాడేరు ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి చొరవ చూపి పెదపాడు గ్రామంలో గల తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు హరి, భాస్కర్ రావు, శిరీష, రాధా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సంస్థల సమావేశం

విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు విశాఖ నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహారాణి పేట వద్దగల విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం స్థలం సందర్శించారు. అనంతరం జిల్లా పరిషత్ హాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలలో ఉన్నటువంటి గ్రంథాలయ అభివృద్ధికి మార్గాలను నిర్దేశించుకోవడమే ఈ సమీక్ష సమావేశాలు యొక్క ఉద్దేశమని తెలిపారు. జిల్లాలలో ఉన్నటువంటి పరిస్థితులు, అవసరాలకు తగ్గట్టుగా టెక్నాలజీని జోడిస్తూ డిజిటల్ లైబ్రరీ లను గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లి ప్రజలకు అందుబాటులోకి ఉంచాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ప్రతి జిల్లాలోని పర్యటిస్తూ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# జిందాల్ స్టీల్ కంపెనీ, అణు విద్యుత్ ప్రాజెక్టులను వెంటనే రద్దు చేయాలి

### సిపిఐ (ఎంఎల్) క్రాంతి జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్

విజయవాడ ఫిబ్రవరి 8 జిందాల్ స్టీల్ వర్క్స్ ప్రాజెక్టులను అమలు చేస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 లో పొందుపరచిన ప్రజలు జీవించే మరియు జీవనోపాధిని పొందే హక్కు ధ్వంసం అవుతుందని సిపిఐ (ఎంఎల్) క్రాంతి జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు.విజయవాడలో పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రంలోని సింగాపుర జిల్లాలోని దంకియ, జగతి , గోవిందపురం పట్టణ గ్రామాల నుంచి తక్షణమే పోలీసు బలగాలను ఉపసంహరించాలని గ్రామస్తులు ఉద్యమ నేతలపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రాజెక్టు రైతులను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వం లో కమిటీని ఏర్పాటు డిమాండ్ చేశారు. తమలపాకు తోటలు నష్టపోయిన రైతులు కూలీలకు ప్రభుత్వం నస్తాపరియారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అణు విద్యుత్ ప్లాంట్ ను రద్దు చేయాలిఉతారంధ్రను నాశనం చేసే కొవ్వాడ అణువిద్యుత్ రద్దు చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు అమెరికా ఆర్థిక సహాయంతో కొవ్వాడ లో కేంద్రం అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తుందని సాంకేతిక పరిజ్ఞానం గల అమెరికా, జపాన్ వంటి దేశాలు అణు విద్యుత్ కేంద్రాలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచమంతా విద్యుత్ భయపడి ప్రత్యామ్నాయ మార్గాల వైపు అడుగులు వేస్తుంటే మన పాలకులు ఎందుకు స్వాగతిస్తున్నారు ఆయన ప్రశ్నించారు.లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం తో ఒకే చోట 6 అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదం ఉందన్నారు. ప్రమాదకరమైన వీటిని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని పార్టీలు, సంఘాలతో ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ప్రసాద్ అన్న, విప్లవ సంఘం రాంబాబు మహిళా సంఘం వసంత ,అరుణ్ అక్క, గోపి తదితరులు పాల్గొన్నారు

# తొందర పాటు నిర్ణయం.. దంపతులు బలి

ఒంగోలు ఆలోచన రహితం, తొందర పాటు నిర్ణయం నవ దంపతులను బలి గొనగా రెండు కుటుంబాల్లో విషాదం నిపింది. అటు తన కుమారుని జీవితం ఆనందమయంగా సాగాలని, ఇటు తన కూతురు ఒక కలకాలం సంతోషంగా ఉండాలని రెండు కుటుంబాల పెద్దలు ఎంతో సంతోషంగా తమ పిల్లలకు పెండ్లి చేసి 30 రోజులు గడవక ముందే జీవితంలో మాధుర్యాన్ని ఆస్వాదించక క్షణికావేశంలో తనువులు చాలించి రెండు కుటుంబాల్లో విషాదం మిగిల్చారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మేదరమెట్ల గ్రామంలో చోటు చేసుకుంది.గ్రామస్థులు, పోలీసులు వెల్లడించిన వివరాలు ఇవీ.. కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన పొదిలి శ్రీమన్నారాయణ, రమణమ్మ దంపతుల కుమారుడు మహానంది అనే 30 ఏళ్ల వ్యక్తి ఛత్తీస్‌గఢ్‌లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఒంగోలు మండలం ముక్తి నూతలపాడుకు చెందిన ప్రియాంక అనే 24 ఏళ్ల యువతితో పెళ్లి చేశారు. వైభవంగా గత ఏడాది డిసెంబర్ 28న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. సంక్రాంతి జరుపుకొని పండుగ తర్వాత భార్యను మెట్టింట్లోనే ఉంచి మహానంది ఛత్తీస్ గఢ్‌లో విధుల్లో చేరాడు.అయితే, ఇటీవల ఏపీలో కానిస్టేబుళ్ల భర్తీ ప్రకటన విడుదలైంది. దీంతో ఆ పరీక్షలకు చదవాలని మహానంది తన భార్య ప్రియాంకను కోరాడు. అయితే, ఉద్యోగం చేయడం తనకు ఇష్టం లేదని ప్రియాంక చెప్పేసింది. ఇతను ఉద్యోగం చేయాల్సిందేనని పట్టుబట్టాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చినట్లుగా తల్లిదండ్రులు తెలిపారు. ఇది భరించలేని ప్రియాంక ఈ నెల 4న పుట్టింట్లోని తన పడక గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మహానంది.. హుటాహుటిన విమానంలో హైదరాబాద్ చేరుకొని.. అక్కడి నుంచి బస్సులో ఒంగోలుకు చేరుకున్నాడు. ఒంగోలు వచ్చి తన తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి భార్య లేని జీవితం తనకు వద్దంటూ వాపోయాడు. అఘాయిత్యం చేసుకుంటాడని ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతనికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. అనంతరం ఉదయం 5 గంటల సమయంలో వాసు అనే స్నేహితుడి ఫోన్ చేసి తాను గుండ్లకమ్మ రిజర్వాయర్ దగ్గర ఉన్నానని, చనిపోతున్నట్టు మహానంది చెప్పాడు. వెంటనే, స్నేహితులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హుటాహుటిన అక్కడికి చేరుకోగా.. ఒడ్డున మహానంది బ్యాగ్, షూ, ఫోన్, ఫొటోలు ఉండటాన్ని గుర్తించి లబోదిబోమన్నారు.పోలీసులు, ఒంగోలు, అద్దంకి అగ్నిమాపక సిబ్బంది జలాశయం వద్దకు చేరుకుని బోట్ల సహాయంతో జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టి.. మహానంది మృతదేహాన్ని బయటకి తీశారు. చిన్నపాటి మనస్పర్థలకే భార్యాభర్తలు ఇలా ఆత్మహత్య చేసుకోవడం గ్రామస్థులను కలచి వేసింది. బంధు మిత్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

# అఖిలపక్ష ఆందోళనలతో... నిరసనలు

విజయవాడ, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్)క్షంగా ఆందోళనలను ఏపీలో ఉద్యమం చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కేవలం టీడీపీ మాత్రమే కాకుండా తమతో కలసి వచ్చే పార్టీలతో కలసి కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. ఇటీవల ఉద్యోగ సంఘాలు తలపెట్టిన చలో విజయవాడ సక్సెస్ అయింది. ప్రజలు కూడా వారికి అండగా నిలిచారు. ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయవాడలో నినదించారు. దీంతోనే జగన్ ప్రభుత్వం దిగివచ్చి వారితో చర్చలు జరిపి డిమాండ్లకు తలొగ్గింది. ఇదే తరహాలో ఉద్యమాలను చేయాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. ప్రజల భాగస్వామ్యం గురించి ఆలోచించేకంటే అధికార పార్టీ మినహా అన్ని పార్టీల కార్యకర్తలను సమాయత్తం చేసి జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించాలన్నది చంద్రబాబు ప్లాన్. ఇక ఏపీలో రెండేళ్లు మాత్రమే ఎన్నికలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు తప్పించి ఏపీలో అభివృద్ధి లేదని, ఇసుక నుంచి విద్యుత్తు వరకూ అనేక సమస్యలున్నాయి. పాలన చేతకాక జగన్ ఏపీని అప్పుల్లో ముంచేశారని టీడీపీ తరచూ ఆరోపిస్తున్నా ప్రజల నుంచి పెద్దగా స్పందన రావడంలేదు. అందుకే భారీ ఉద్యమాన్ని చేసి ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను పెంచాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నట్లు తెలిసింది.ఎన్నికల పొత్తు అనే మాట లేకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలసి వచ్చే పార్టీలతో కలసి ఉద్యమాలను రూపొందించాలని చంద్రబాబు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిసింది. దీనికి టీడీపీ లీడ్ రోల్ పోషిస్తుంది. చలో విజయవాడలో ఉద్యోగ సంఘాలకు వామపక్షాలు సహకరించాయి. అదే తరహాలో ఉద్యమాన్ని నిర్వహించి ప్రభుత్వాన్ని ఇరుకుపెట్టాలన్నది చంద్రబాబు వ్యూహంగా ఉంది. బీజేపీ, జనసేనలు కలసి వస్తే ఇబ్బంది లేకుండా వారితో మంతనాలు జరిపే బాధ్యతను చంద్రబాబు సీనియర్ నేతలకు అప్పగించినట్లు తెలిసింది

# వినుకొండ మునిసిపల్ కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి

గుంటూరు ఫిబ్రవరి 8 ;లోకాయుక్త ఆదేశాలు దిక్కరించి ఎలాంటి నోటిసులు ,ఆదేశాలు ఇవ్వకుండా గుంటూరు జిల్లా వేనికొండ లోని ఎన్ఎస్పి ఎస్సి కాలనీలో ఇండ్లు కుల్చివేసిన వారిపై చర్యలు తెసుకొని బాదితులకు న్యాయం చేయాలని ఐహెచ్ఆర్ఏ ఏపి సివిల్ రైట్స్ చేర్మెన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేసారు. వినుకొండ లోని ఎన్ఎస్పి ఎస్సి కాలనీలో 48 ఎకరాల ఇరిగేషన్ ల్యాండ్ లో ఇరిగేషన్ శాఖ గత 22 సంవత్సరాల క్రితం 22 ఎకరాల స్థలం దళితులకు ఇచ్చిందని దానిలో బాదితులు ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్నారని తెలిపారు.కాని అట్టి స్థలం విలువ పెరుగటం తో దాని పై కన్నేసిన స్థానిక ఎంఎల్ఏ బొల్లా బ్రమ్మనాయుడు అతని అనుచరులు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రావు తో కుమ్ముక్కయి మొదట పలువురి దళితుల ఇండ్లు కుల్చివేసారని ఆరోపించారు. దీనిపై బాదితులు లోకాయుక్తని ఆస్రయించగా లోకాయుక్త నోటిసులు జాజి చేసినప్పటికీ పట్టించ్కోలేదని తెలిపారు.తమకు న్యాయం చేయాలంటూ స్తానిక పోలీస్ లను ఆస్రయించగా లోకాయుక్త గీకా యుక్త లేదు అంటూ మునిసిపల్ అధికారులకు మద్దతిస్తు బాదితులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు చూపించకుండా జనవరి 6 వ తేదిన కొన్ని ఇల్లు,ఫిబ్రవరి 4 న మరికొన్ని ఇళ్ళు విడతలవారిగా కుల్చివేసారని, పేర్కొన్నారు. అసలే కరోనా టైం లో బాదితులు ఎక్కడికి వెలుతారని తిరుపతి నాయుడు ప్రశ్నించారు.దీని పై ముఖ్యమంత్రి కార్యాలయానికి బాదితులు వెళ్లి మొరపెట్టుకోగా వారు జిల్లా జైంట్ కలక్టర్ కు చెప్పి కుల్చివేతలు ఆపమని చెప్పిన ఎం ఎల్ ఏ అండదండలతో ఇల్లు కుల్చివేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.కూల్చివేత సమయం లో మునిసిపల్ కార్యాలయానికి బాదితులు వెళ్ళగా కమిషనర్ కలువలేదని ,ఫోన్ చేస్తే ఆపిస్తానని చెప్పి ఆపించాలేదని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రావుని వెంటనేసస్పెండ్ చేయాలని, అలాగే స్తానిక పోలీసులపై చర్యలు తెసుకోవాలని డిమాండ్ చేసారు.దీనిపై ప్రదానమంత్రికి, ఐహెచ్ఆర్ఏ కు పిర్యాదు చేయనున్నట్లు తిరుపతి నాయుడు తెలిపారు.

# 'జగనన్న చేదోడు తీసుకున్న మహిళా దర్జీలు ఎక్కడ?'



అమరావతి: మహిళా హోం మంత్రి ఉన్న శాఖలో మహిళా పోలీసులకు అవమానం ఎదురైయిందని టీడీపీ నేత గుమ్మిడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న చేదోడు తీసుకున్న మహిళా దర్జీలు ఎక్కడ?, నెల్లూరు జిల్లాలో మహిళా టైలర్లు లేరా?? అని ఆమె ప్రశ్నించారు. మగవారితో మహిళా పోలీసుల బట్టల కొలతలు తీయించి, దారుణంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలని చిన్న చూపా? చిరుద్యోగులు అని చిన్న చూపా??, రక్షణ కల్పించాల్సిన పోలీసులకే రక్షణ కరువా?, తన సొంత శాఖలోనే మహిళలకు రక్షణ లేనప్పుడు మహిళా హోం మంత్రి ఉండి ప్రయోజనమేమిటి? అని ఆమె ప్రశ్నించారు. పోలీసు మహిళలకు జరుగుతున్న అవమానానికి హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న చేదోడు అని కోట్లాది రూపాయలతో పత్రికా ప్రకటనలు చేస్తున్నారని, చోదోడు డబ్బు నిజంగా మహిళా దర్జీకే ఇస్తున్నారా? అని విమర్శించారు. మహిళా పోలీసులకే రక్షణ ఇవ్వలేనప్పుడు రాష్ట్రంలో మహిళలందరికీ ఎవరు రక్షణ కల్పిస్తారు? అని ప్రశ్నించారు.

## ఏసీబీకి దొరికిన గుడ్లవల్లేరు వీఆర్వో

విజయవాడ కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు గ్రామ సచివాలయం-2 పై ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. పట్టాదారు పాస్ బుక్ జారీకి గ్రామ విఆర్వో వసుంధర 5 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. మండలంలోని వేమిగుంట గ్రామంలో ఉన్న రెండున్నర ఎకరాల భూమికు పట్టాదారు పాసుపుస్తకం జారీకి వీఆర్వో 5 వేలు లంచం డిమాండ్ చేసిందని ఆరోపణ. భూమి సూపర్వైజర్ సురేష్ ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ శరత్ బాబు ఆధ్వర్యంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకున్న వసుంధరను ఆరెస్టు చేసి సంబంధిత కోర్టులో హాజరు పరిస్తామని వారు వెల్లడించారు.


## ఉద్యమానికి రెడీ అవుతున్న ఉద్యోగ సంఘాలు

విజయవాడ, ఫిబ్రవరి 8, () పీఆర్సీ వివాదం ముగిసిపోలేదా? టీచర్లు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నారా? ఇందుకు సంబంధించి ఈ నెల 11న కార్యాచరణ సిద్ధం కానుందా? అంటే అవునని అంటున్నాయి ఉపాధ్యాయ సంఘాలు. ఈ నెల 5న ఖఖీఅ స్టీరింగ్ కమిటీతో మంత్రుల కమిటీ జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో ఆరో తేదీ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన సమ్మె యోచనను విరమించుకున్నాయి ఉద్యోగ సంఘాలు. మరోవైపు, ఉద్యోగుల ఆందోళనలపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. ఉద్యోగులను ఎర్రజెండా, పచ్చజెండాలు కలిసి రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారని సీఎం జగన్ ఆరోపించారు.ప్రభుత్వం స్టీరింగ్ కమిటీ సభ్యులు చీకటి ఒప్పందాలు చేసుకున్నారన్నది ఉపాధ్యాయ సంఘాల ఆరోపణ. దాన్ని త్వరలోనే బయటపెడుతామని అంటున్నాయి. అసలు అంతర్గత ఒప్పందం జరిగిందా? అందులో ఏముంది? నిజంగా అది బయటకు వస్తే సంచలనం కాబోతుందా? అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఫిట్‌మెంట్ మార్చాలని కోరామంటున్న ఉపాధ్యాయ సంఘాలు.. తమ ఆవేదనను సిఎంకు వివరించేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నాయి. 5వ తేదీన జరిగిన చర్చల్లో తమ ఆవేదన చెప్పిన పట్టించుకోలేదని యూటీఎఫ్ సంఘం నేతలు అంటున్నారుఒప్పందాలపై అప్పుడు సంతకాలు చేసి.. ఇప్పుడు ఈ రచ్చ ఏంటని ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. తాము సమావేశానికి హాజరైనట్లు సైన్ చేశామె తప్పా.. అగ్రిమెంట్ మీద కాదని బదులిస్తున్నాయి ఉపాధ్యాయ సంఘాలు. చర్చలకు హాజరైనట్లు సంతకాలు పెడితే.. అగ్రిమెంట్ ఒప్పుకున్నట్లు ప్రచారం చేస్తున్నాయని ఫ్యాప్టో అంటోంది.మొత్తంగా ఉపాధ్యాయులు మరో పోరుకు సిద్ధం అవుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాబోతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇదిలావుంటే, ఉపాధ్యాయుల ఆందోళనలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందించారు. కొంతమంది టీచర్లను విపక్ష పార్టీల నేతలు స్వార్థంతో రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఇలా అయితే పిల్లల భవిష్యత్ పాడవుతుందన్నారు. ఇప్పటికే కరోనాతో పాఠశాలలు మూత విద్యార్థుల చదువులకు అటంకం కలిగిందన్న సీఎం.. పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఇప్పటికే పాఠశాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చామని, టీచర్లకు మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకువస్తామని జగన్ హామీ ఇచ్చారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయశాఖ కమిషనర్ సమీక్ష

శ్రీశైలం శ్రీశైలంలో ఈ నెల 22 నుంచి జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం పరిపాలనా భవనంలో ఏపీ దేవాదాయశాఖ కమిషనర్ హరిజవాహర్ లాల్ దేవస్థానం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో లవన్న,అధికారులు ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. ముందుగా ఈవో ఎస్.లవన్న దేవస్థానం నిర్వహించబోతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి కమిషనర్ కు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ శివరాత్రికి విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు పకడ్బందీగా చేయాలన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బ్రహ్మోత్సవాలు నిర్వహించాలన్నారు. కాలినడకన వచ్చే భక్తులకు నల్లమల అటవీ మార్గమధ్యంలో వసతి, మంచినీరు, వైద్య సదుపాయాలు జిల్లా అధికారులు కలసి ఏర్పాట్లు త్వరగతిన చేయాలన్నారు. క్షేత్రంలో పారిశుద్ధ్యం, వైద్యం, వసతి పార్కింగ్, సామాన్లు భద్రపరచడం, ట్రాఫిక్ నియంత్రణ మొదలైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమన్వయంతో కృషి చేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే క్షేత్రంలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా రాబోయే 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా బహుత్తర ప్రణాళికతో అభివృద్ధి ఏర్పాట్లు చేయాలన్నారు.

## సింగరేణిలో గులాబీ వర్సెస్ కమలం




హైదరాబాద్, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్) బడ్జెట్ మీద నిన్నటిదాకా బీజేపీపై విరుచుకుపడిన టీఆర్ఎస్ తాజాగా సింగరేణి అంశాన్ని ఎత్తుకుంది. సింగరేణిని కేంద్రం ప్రైవేటీకరిస్తోందని ఆరోపిస్తూ కేటీఆర్ కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి ఘాటు లేఖ రాశారు. దాన్ని మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకునేలా చేశారు. ఇటీవల కేంద్రం నాలుగు బొగ్గు బ్లాకులను వేలం వేయాలని నిర్ణయించింది. వాటిని సింగరేణికి కేటాయించకపోవడం అంటే ప్రైవేటీకరణకు తొలి మెట్టు అని.. ఇలాంటి వాటిని తాము సహించబోమని కేటీఆర్ చెప్పారు. కేటీఆర్ కేంద్రమంత్రికి రాసిన లేఖ? కాస్త ఘాటు పదాలతోనే ఉంది. నేడో రేపో సింగరేణిని వేలం వేసేస్తున్నారన్నట్లుగా కేటీఆర్ లేఖ సంధించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కావల్సిన ఐరన్ ఓర్ గనులు ఇవ్వకుండా నష్టాలకు గురిచేసిన కేంద్రం దాన్ని ప్రయివేటీకరించేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ఇలాంటి కుట్రలనే సింగరేణిపై ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నదని అందోళన వ్యక్తం చేశారు. సింగరేణి అంటే కోల్ మైన్ మాత్రమే కాదని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే గోల్డ్ మైన్ అని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. నాలుగు బ్లాకులు మాత్రమే వేలం వేయడం లేదని, వేలాది మంది కార్మికుల భవిష్యత్తును బహిరంగ మార్కెట్ లో వేలం వేస్తోందని కేటీఆర్ విమర్శించారు. తక్షణం వేలం ఆపాలన్నారు. కేటీఆర్ లేఖపై బీజేపీ ఉలిక్కి పడింది. బొగ్గు బ్లాకుల వేలం సహజంగానే జరుగుతోందని సింగరేణికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. గతంలో ఒడిషాలో తొమ్మిది బ్లాకుల్ని తెలంగాణ వేలంలో దక్కించుకుందన్నారు. అనవసరంగా సెంటిమెంట్ రెచ్చగొట్టే ప్రయత్నాలు కేటీఆర్ చేస్తున్నారని బీజేపీ విమర్శించింది. రూ.20 వేల కోట్లను దారి మళ్లించి సింగరేణిని కేసీఆర్ దివాలా తీయిస్తోంది కేసీఆరేనని.. దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

# అలుపెరుగని ప్రజా సేవ

**ఒక వైపు టీడీపీ నాయకుడిగా ప్రజా సేవ**
**మరో వైపు వైద్యుడిగా ప్రజాసేవ..**
**ప్రజా సేవలో నిరంతర రాజకీయ వైధ్య శ్రామికుడు..**
**రాజకీయం ,వైధ్యం రెండు కళ్ళుగా భావిస్తున్న కష్టజీవి**
**కార్యకర్తల ఇంటి పెద్దగా నీరాజనాలందుకుంటున్న జయ నాగేశ్వర రెడ్డి**






మంత్రాలయం ఫిబ్రవరి 8,( విభారె) : రాజకీయ నాయకుడిగా ఒకవైపు ప్రజా సేవ చేస్తూనే మరోవైపు వైద్యుడిగా కార్యకర్తల ఆరోగ్యాన్నే కాకుండా తన నియోజకవర్గంలో ఏ పార్టీ కార్యకర్తలైనా, ప్రజలకు తన నుంచి ఏ సహాయం కోరి వచ్చిన సహాయం చేయడంతో పాటు అనారోగ్యంతో ఉన్న వారికి మంచి వైద్యం అందించేందుకు తోడ్పడుతున్న రాజకీయ నాయకుడే కాకుండా ప్రముఖ వైద్యులుగా కూడా తన సేవలను అందిస్తున్నాడు నిరంతర శ్రామికుడు, ప్రజల మనిషి, టీడీపీ శ్రేణులు కాకుండా నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని ఇంటి పెద్దగా భావిస్తూ ప్రజలచే నీరాజనాలందుకుంటున్న మహోన్నతమైన వ్యక్తి, మంచి మనిషి ఎమ్మిగనూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ .జయ నాగేశ్వర రెడ్డి. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు కార్యకర్తలు కాకుండా ఏ పార్టీకి చెందిన వారైనా సరే అనారోగ్యంతో తన దగ్గరకు వచ్చి విషయం చెబితే మంచి సలహా ఇవ్వు వైద్యంలో మంచి సలహాలు ఇవ్వడంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల లోని మంచి వైద్యశాలకు సిఫారసు చేసి డాక్టర్లతో మాట్లాడి మంచి వైద్యం అందించి వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా చేసి వారి కుటుంబంలో వెలుగులు నింపుతున్న మహోన్నతమైన వ్యక్త ఎమ్మిగనూరు మాజీ శాసనసభ్యులు,రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మాజీ శాసనసభ్యులు డాక్టర్ .జయనాగేశ్వర రెడ్డి. ఒక ప్రజా పాలకుడిగా మాజీ శాసన సభ్యులుగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి,ప్రజలకు సేవలు అందించడమే కాకుండా ఒక వైద్యుడిగా తమ కార్యకర్తలను కాపాడుకోవడంలో ముందుంటారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులకు కార్యకర్తలకే కాకుండా ఏ పార్టీకీ చెందిన వారైనా సరే అనారోగ్యం తన గడప తగ్గితే వారికి తగిన వైద్య సలహాలు అందించడమే కాకుండా మంచి డాక్టర్ కు సిఫారసు చేసి మనవాళ్లే బాగా చూసుకోండి మంచి వైద్యం అందించండి అంటూ డాక్టర్లు చెప్పిమంచి వైద్యం అందేటట్లు చేసి వారికి ఆర్థిక సహాయం కూడా అందించే కలియుగ కర్ణుడు జయ నాగేశ్వర రెడ్డి. నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా, ఎటువంటి అనారోగ్యం సంభవించినా విషయం తెలుసుకున్న వెంటనే వారి గ్రామానికి వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకొని తగిన వైద్య సలహాలు సూచనలు ఇచ్చి ఇంకా అవసరమైతే మెరుగైన వైద్యం కోసం రాష్ట్రంలోని రెండు తెలుగు రాష్ట్రాల లోని వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేసి మెరుగైన వైద్యం అందించడంలో మానవత్వం కలిగిన మంచి మనిషిగా ప్రజల కుటుంబంలోని ఒక కుటుంబ పెద్దగా ముందుంటారని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు కార్యకర్తలే కాకుండా ప్రజలందరూ కాకుండా జయనాగేశ్వర రెడ్డి గారి సేవలను కొనియాడుతూ ఉంటారు. పార్టీలకతీతంగా ఆయన దగ్గరికి వచ్చిన వారిని అభిమానంగా పలకరించి వారికి కావలసిన పనులు చేసి పెట్టడమే కాకుండా అనారోగ్యంతో ఉన్న వారిని కూడా మెరుగైన చికిత్స అందించడంలో తోడు పడుతుంటారు.అందులో భాగంగానే నందవరం మండలంలోని హాలహర్వి పంచాయితీ పరిధిలోని బాపురం గ్రామంలో మంగళవారం పర్యటించి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు కిష్టప్ప గారిని వారి స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి వారి కుటుంబ సభ్యులను, వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొని ఒక వైద్యునిగా వారికి తగిన సూచనలు చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డాక్టర్.బి. వి. జయనాగేశ్వర రెడ్డి తమ గృహానికి వచ్చి పెద్ద అయినను పలకరించి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం, మీకు నేనున్నాను అంటూ భరోసా ఇవ్వడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందంతో ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ నాయకులు అధికారులు ప్రజల సౌకర్యం కోసం ఆలోచించాలి

## అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ



నంద్యాల ఫిబ్రవరి 8,( విభారె) . పాణ్యం , గడివేముల ప్రజలతో ప్రజాభిప్రాయం సేకరించాలని కోరుతూ మంగళవారం నాడు నంద్యాల సబ్-కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ గారికి అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు అర్జీ సమర్పించారు . రాజకీయ నాయకులు ఏకపక్ష నిర్ణయంతోనే రెండు మండలాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి ఇంటి నుండి ఒక అర్జీ (వినతిపత్రం) అధికారులకు పంపిస్తామని తెలిపారు. అర్జీనీ సచివాలయం , ఎంఆర్ఓ కార్యాలయం , ఆర్డీఓ కార్యాలయం , కలెక్టర్ కార్యాలయం ఎక్కడైనా సరే అర్జీ ఇచ్చి రిసీవ్డ్ కాపీ తీసుకొని మా వాణిని వినిపిస్తామని వారు తెలిపారు.పాణ్యం , గడివేములను నంద్యాల జిల్లాలో చేర్చేవరకు పోరాటం ఆగదని జేఏసీ నేతలు తెలిపారు. పాణ్యం , గడివేముల మండలాలు , గ్రామాలు నంద్యాలకు 5కిమీ , 10 కిమీ , 15 కిమీ , 20 కిమీ దూరంలో ఉన్నాయనీ , ఈ రెండు మండలాల ప్రజలు ఎన్నో సంవత్సరాల నుండి నంద్యాలతో అనుబంధముందనీ , వ్యాపార పరంగా , విద్య , వైద్యం , ఉపాధి , ఉద్యోగాలు , వ్యాపారాలు , పెట్టుబడులు తదితర రంగాలలో నిత్యం ఈ రెండు మండలాల ప్రజలు వేల సంఖ్యలో నంద్యాలకు వెళుతుంటారనీ , పక్కనే ఉన్న నంద్యాలలో కాకుండా కర్నూలు జిల్లాలో కలిపితే లోకల్ - నాన్ లోకల్ అని ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు.అంతే కాక దీనివలన రైతులు , విద్యార్థులు , యువత తీవ్ర నష్టపోతుందనీ , కర్నూలు జిల్లాలో కలిపితే ప్రతి చిన్న పనికీ వ్యవప్రయాసాలతో 75 కిమీ వందల రూపాయలు వెచ్చించి వెళ్లవలసి ఉంటుందన్నారు. పాణ్యం , గడివేముల మండలాలు నంద్యాల జిల్లాలో కొనసాగితేనే అభివృద్ధి చెందుతాయన్నారు.ఇప్పటికైనా అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి పాణ్యం , గడివేముల మండలాలను నంద్యాల జిల్లాలోనే కలిపి ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కేజె శ్రీనివాస్ రావు. వనం వెంకటాద్రి. రామినేని రాజు నాయుడు. దనుంజయుడు. శివ క్రిష్ణ యాదవ్. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్బికే లో ఉండే బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం

తుగ్గలి ఫిబ్రవరి 8,( విభారె) మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక సచివాలయం నందు మంగళవారం రోజున ఆర్బికే పరిధిలోని గల బ్యాంకు సేవలపై వ్యవసాయ మరియు బ్యాంకు అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ సంబంధిత మరియు పశు వైద్య శాఖ తరపున కెసిసి ఇవ్వబడునని, పంట రుణాలు మరియు గోల్డ్ లోన్స్ ద్వారా రైతులు బ్యాంకు సేవలను వినియోగించుకోవచ్చని తెలియజేశారు.అదే విధంగా అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ ద్వారా భూమి అభివృద్ధి కార్యక్రమాలు,వ్యవసాయ పనిముట్ల కొనుగోలు,రూరల్ గోడౌన్,సెరికల్చర్,అగ్రికల్చర్, హార్టికల్చర్ వంటి వాటిపై కూడా బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని వారు తెలియజేశారు.రైతులకు కిసాన్ క్రెడిట్ ద్వారా లోన్లు,జేఎల్జి గ్రూపుల ద్వారా కౌలు రైతులకు లోన్స్ అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు.రైతు సంఘం గ్రూపుల ద్వారా రైతులకు అందించడం జరుగుతుందని తెలియజేశారు.హౌసింగ్,వెహికల్ మరియు ఎడ్యుకేషన్ లోన్ లకు సంబంధించి బ్యాంకు సేవలు అందుబాటులో ఉన్నట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.




# డాక్టర్ జాకీర్ హుస్సేన్ దేశానికి అందించిన సేవలు అమోఘం

నంద్యాల ఫిబ్రవరి 8,( విభారె) నంద్యాల పట్టణంలో మంగళవారం నాడు ఓ ప్రకటనలో జానో జాగో (ముస్లింల అభివృద్ధి వేదిక ) జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా అల్ మదర్ పౌండేషన్ అధ్యక్షులు ఆకుమల్ల రహీం ఆంధ్ర ప్రతిభ ఎడిటర్ ఎన్ జావిద్ మాట్లాడుతూ భారతరత్న 3వ రాష్ట్రపతిగా మరియు తన సంపదనంతా భారతదేశానికి ధారాదత్తం చేసిన గొప్ప దానకర్ణుడిగా అభివర్ణించారు. భారతదేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని చెప్పిన గొప్ప దేశభక్తుడు డా: జాకిర్ హుస్సేన్ అని అన్నారు. ఆయన 1897 ఫిబ్రవరి 8న హైదరాబాదులో జన్మించారని అతి చిన్న వయసులో 23 సంవత్సరాల వయస్సులో ఢిల్లీ దగ్గర జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, దానికి జామియా మిల్లియా ఇస్లామియా అనే పేరు పెట్టారని తెలిపారు. బ్రిటిష్ వారితో పోరాటానికి మహాత్మా గాంధీతో కలిసి నడిచారని "బేసిక్ విద్య" పై కఠోర ప్రయత్నాలు చేసి భారతదేశంలో విద్యాభ్యుదయానికిశ్రమించారని తెలిపారు. ఉత్తమదార్శనికుడిగా భారత విద్యావిభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారని అన్నారు. స్వాతంత్ర్యం తరువాత అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవి అలంకరించారని వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయబడ్డారు 1957లో బీహారు గవర్నరుగా తన సేవలను అందించారని ఉప రాష్ట్రపతిగా తదనంతరం భారత రాష్ట్రపతిగా ఎన్నికయ్యారని తెలిపారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన తొలి వ్యక్తి కూడా ఆయనే అని అన్నారు. ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించి సత్కరించారు అని తెలిపారు.



# 'క్యాచ్ మీ'.. ఖిలాడీలోని హై వోల్టేజ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ నంబర్..!




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ "ఖిలాడి". రమేష్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రవితేజ డ్యూయెల్ రోల్ ప్లే చేశారు. మీనాక్షి చౌదరి మరియు డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 11న తెలుగు హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ స్పీడ్ పెంచిన మేకర్స్.. తాజాగా 'క్యాచ్ మీ' అనే సాంగ్ ను రిలీజ్ చేసారు.'ఖిలాడి' సినిమా కోసం రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన అన్ని పాటలు వేటికవే ప్రత్యేకంగా నిలిచాయి. 'ఇష్టం' - 'ఖిలాడీ' టైటిల్ సాంగ్ - 'అట్టా సూడకే' - 'ఫుల్ కిక్కు' వంటి పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ క్రమంలో ఇప్పుడు వచ్చిన 'క్యాచ్ మీ ఇఫ్ యూ కెన్' లిరికల్ సాంగ్ కూడా ఆకట్టుకుంటోంది. 'హెల్లో మిస్టర్ మ్యాచో మ్యాన్.. నాతో కొంచెం నాచో మ్యాన్.. నాటీ డేటే పూచో మ్యాన్.. మిస్సయితే రాదు సోచో మ్యాన్..' అంటూ తెలుగు ఇంగ్లీష్ పదాల కలయికతో క్యాచీ లిరిక్స్ అందించారు లిరిసిస్ట్ శ్రీమణి.దేవిశ్రీ ట్యూన్ చేసిన ఈ హై వోల్టేజ్ డ్యాన్స్ నంబర్ ను.. సింగర్స్ నేహా బాసిన్ - జస్ప్రీత్ జాస్ కలిసి హుషారుగా ఆలపించారు. స్పెషల్ సెట్ లో చిత్రీకరించిన 'క్యాచ్ మీ' పాటలో హీరోహీరోయిన్లు వేసిన స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా డింపుల్ హయాతి ఇందులో రెచ్చిపోయిందనే చెప్పాలి. ఓవైపు కురచ దుస్తుల్లో హాట్ హాట్ అందాలను ఆరబోస్తూనే మరోవైపు ఎనర్జిటిక్ డ్యాన్స్ లతో మెస్మరైజ్ చేసింది. శేఖర్ మాస్టర్ ఈ సాంగ్ కు కొరియోగ్రఫీ చేసారు."ఖిలాడి" చిత్రానికి సుజిత్ వాసుదేవ్ మరియు జి.కె. విష్ణు సినిమాటోగ్రఫీ అందించారు. గాంధీ నడికుడికర్ ఆర్ట్ డైరెక్టర్ గా.. అమర్ రెడ్డి ఎడిటర్ గా వర్క్ చేశారు. జయంతీలాల్ గడ (పెన్ స్టూడియోస్) సమర్పణలో హవీష్ ప్రొడక్షన్స్ - ఎ స్టూడియోస్ బ్యానర్స్ పై సత్యనారాయణ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో యాక్షన్ కింగ్ అర్జున్ - ఉన్ని ముకుందన్ - అనసూయ - ముఖేష్ రుషి - వెన్నెల కిషోర్ - రావు రమేష్ - మురళీ శర్మ - నికితిన్ ధీర్ - ఠాకూర్ అనూప్ సింగ్ - సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషించారు.

# నటుడిగా తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించే పాత్రలో చైతూ..!

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య కెరీర్ ప్రారంభంలో పెద్దగా ప్రయోగాలు చేయకపోయినా ఇటీవల కాలంగా విభిన్నమైన కథలను విలక్షణమైన పాత్రలను ఎంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. సరైన స్క్రిప్ట్ సెలెక్ట్ చేసుకుంటూ వరుస విజయాలను అందుకుంటున్నారు. 'మజిలీ' 'వెంకీమామ' 'లవ్ స్టోరీ' 'బంగార్రాజు'.. ఇలా వేటికవే ప్రత్యేకమైన కథలను ఎంచుకుంటూ నాలుగు బ్యాక్ టు బ్యాక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు మరో సరికొత్త పాత్రల్లో కనిపించడానికి రెడీ అవుతున్నారు చైతూ.గతేడాది శేఖర్ కమ్ముల దర్శకత్వంలో చేసిన 'లవ్ స్టోరీ' చిత్రంలో దళిత యువకుడిగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు నాగచైతన్య. ఇటీవల తన తండ్రితో కలిసి చేసిన 'బంగార్రాజు' సినిమా ద్వారా అవుట్ అండ్ అవుట్ మాస్ మసాలా పాత్రలను పోషించగలడని నిరూపించారు.



ప్రస్తుతం విక్రమ్ కె కుమార్ డైరెక్షన్ లో నటిస్తున్న 'థాంక్యూ' మూవీలో చైతూ మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ క్రమంలో ఇప్పుడు మరో అడుగు ముందుకేసి నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించడానికి సిద్ధమయ్యారు.నాగచైతన్య డిజిటల్ డెబ్యూ ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ఓ హారర్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ లో నటించబోతున్నట్లు ఇప్పటికే క్లారిటీ ఇచ్చేసారు. దీనికి కూడా విక్రమ్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఈ ఒరిజినల్ షూటింగ్ ప్రారంభం కానుంది. దీనికి "ధూత" అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే కనుక నిజమైతే టైటిల్ ని బట్టి ఇందులో చైతన్య ఒక మెసెంజర్ గా కనిపిస్తారని అనుకోవచ్చు.ఆత్మలతో మాట్లాడి మానవులకు సందేశం ఇచ్చే దూతగా కనిపిస్తారని అంటున్నారు. అయితే హారర్ వెబ్ సిరీస్ లో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించనున్నట్లు చైతూ ఆ మధ్య ఓ బాలీవుడ్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. విక్రమ్ కుమార్ చెప్పిన స్క్రిప్ట్ అద్భుతంగా ఉండటంతో నెగిటివ్ రోల్ అయినా చేయడానికి రెడీ అయినట్లు తెలిపారు.మంచి స్క్రిప్ట్ దొరికినప్పటికీ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రతో సినిమా చేద్దామని నిర్మాతలను అడగలేనని.. ఓటీటీల్లో వచ్చే వెబ్ సిరీసులు ఎలాంటి పాత్ర అయినా చేసే అవకాశం అందిస్తోందని నాగచైతన్య అభిప్రాయపడ్డారు. బిగ్ స్క్రీన్ మీద తమకున్న రిస్ట్రిక్షన్స్ వల్ల చాలా మంది యాక్టర్స్ అన్ని రకాల పాత్రల్లో నటించడం లేదని.. కానీ ఇప్పుడు ఓటీటీల వల్ల కుదురుతుందని చెప్పారు. ఇందులో నటించడానికి చైతన్య చాలా ఎగ్జైట్ గా ఉన్నారని తెలుస్తోంది.ఈ హారర్ థ్రిల్లర్ సిరీస్ లో నాగచైతన్యతో పాటుగా ప్రియా భవానీ శంకర్ కీలక పాత్ర చేయనున్నట్లు టాక్ నడుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్ లో త్వరలో ఈ ఒరిజినల్ షూటింగ్ ప్రారంభం కానుంది. 'మనం' సినిమా కల్ట్ క్లాసిక్ తర్వాత.. చై - విక్రమ్ కలిసి చేస్తున్న 'థాంక్యూ' మరియు వెబ్ సిరీస్ పై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. వీటి ద్వారా నటుడిగా చైతన్య తనను సరికొత్తగా ఆవిష్కరిస్తారని నమ్ముతున్నారు.

# రచ్చ చేస్తున్న రాకెట్ బాయ్స్

ఇండియాలో కరోనా కారణంగా అనూహ్యంగా ఓటీటీ బిజినెస్ పెరిగింది. విదేశాల్లో ఓటీటీ లు అంటే అత్యధికంగా వెబ్ సిరీస్ లను ప్రేక్షకులు చూస్తారు. కాని ఇండియాలో మాత్రం ఓటీటీ కంటెంట్ అంటే సినిమాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారు. వెబ్ సిరీస్ లకు ఇండియన్ ప్రేక్షకులు ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. పూర్తి స్థాయిలో వెబ్ సిరీస్ లకు అలవాటు పడేందుకు ఇంకాస్త సమయం పడుతుంది అనుకుంటున్న సమయంలో ఇటీవల వచ్చిన కొన్ని వెబ్ సిరీస్ లు ప్రేక్షకుల ఆలోచన మార్చే దిశగా అడుగులు వేయిస్తున్నాయి. ఇప్పటికే ది ఫ్యామిలీ మ్యాన్ రెండు సీజన్ లు కూడా మంచి స్పందన సొంతం చేసుకుని ఘన విజయం సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఇప్పుడు మరో వెబ్ సిరీస్ ఓటీటీ లో రచ్చ చేస్తోంది. అదే రాకెట్ బాయ్స్.దేశ భక్తితో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ మిలితం చేసి రూపొందిన ఈ వెబ్ సిరీస్ తాజాగా స్ట్రీమింగ్ మొదలు అయ్యింది. హిందీ లో సోనీలివ్ ఓటీటీ ప్లాట్ ఫామ్ పై ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ అవుతుంది. ఈ వెబ్ సిరీస్ లో ఇద్దరు శాస్త్రవేత్తలు చేసిన అద్భుతాలు.. వారి జీవితం గురించి చూపించారు. ఇద్దరు అత్యంత మేధావులు ఎలా కలిశారు.. వారి స్నేహం ఎలా మొదలు అయ్యింది.. శాస్త్రవేత్తలు అయిన ఆ ఇద్దరి స్నేహం ఎలాంటి పరిణామాలకు దారి తీసింది.. వారి జీవితాలు ఎలాంటి టర్నింగ్ తీసుకున్నాయి అనేది ఇంట్రెస్టింగ్ స్క్రీన్ ప్లేతో మేకర్స్ వెబ్ సిరీస్ ను నడిపించారు. మొత్తం ఎనిమిది ఎపిసోడ్స్ గా ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. హిందీ ప్రేక్షకుల నుండి మంచి స్పందన దక్కించుకుంటున్న ఈ వెబ్ సిరీస్ ను ఇతర భాషల్లో కూడా డబ్బింగ్ చేసే అవకాశాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది.జిమ్ షరబ్.. ఇష్వక్ సింగ్.. రెజీనాలు కీలక పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్ కు అభయ్ పన్ను దర్శకత్వం వహించాడు. ఈ వెబ్ సిరీస్ లో దేశ భక్తితో పాటు ఆకట్టుకునే అంశాలను చూపించడం జరిగింది. ఈ దేశ భక్తి వెబ్ సిరీస్ ఇటీవలే స్ట్రీమింగ్ అయ్యి మంచి రివ్యూలను దక్కించుకుంది. ఇప్పటికే విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న రాకెట్ బాయ్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యారు. భాష తో సంబంధం లేకుండా ఓటీటీ ప్రేక్షకులు ఈ వెబ్ సిరీస్ ను చూసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఇండియాలో ఇప్పటి వరకు వచ్చిన వెబ్ సిరీస్ ల్లో ఇది ఒక బెస్ట్ వెబ్ సిరీస్ అనడంలో సందేహం లేదు.




# రెండో వన్డేకు కేఎల్ రాహుల్ సహా కీలక ఆటగాళ్లు రెడీ..

వ్యక్తిగత కారణాల చేత వెస్టిండీస్‌తో తొలి వన్డేకు దూరమైన టీమిండియా వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్.. రెండో వన్డేకు రెడీ అయ్యాడు. అతనితో పాటు మరో ఇద్దరు కీలక ఆటగాళ్లు మయాంక్ అగర్వాల్, నవ్‌దీప్ సైనీలు సోమవారం అహ్మదాబాద్‌లోని టీమిండియా క్యాంపులో చేరారు. బుధవారం జరగనున్న రెండో వన్డే కోసం ఈ ముగ్గురు ప్రత్యేకంగా నెట్స్‌లో చెమటోడ్చారు. 'ఎవరొచ్చారో చూడండి.. ఈ ముగ్గురు జట్టుతో చేరారు. సోమవారం ప్రాక్టీస్ సెషన్‌లో చెమటోడ్చారు' అని బీసీసీఐ ఈ ముగ్గురి ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేసింది. బీసీసీఐ ప్రత్యేకంగా ఈ ముగ్గురి ఫోటోలను షేర్ చేయడం బట్టి చూస్తే, రెండో వన్డేలో వీరు తుది జట్టులో ఉండటం ఖాయంగా తెలుస్తోంది. కాగా, విండీస్‌తో తొలి వన్డేకు ముందు శిఖర్ ధవన్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, బ్యాకప్ ప్లేయర్ సైనీలతో పాటు నలుగురు సహాయక సిబ్బంది కోవిడ్ బారిన పడ్డారు. వీరిలో సైనీ ఐసోలేషన్ పూర్తి చేసుకుని జట్టుతో చేరగా.. ధవన్ స్థానంలో జట్టులోకి వచ్చిన మయాంక్ అగర్వాల్ మూడు రోజుల క్వారంటైన్ ముగించుకుని గ్రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఇదిలా ఉంటే, ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. టీమిండియా తమ 1000వ వన్డేలో టాస్ గెలిచి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుని ప్రత్యర్ధిని 176 పరుగులకే ఆలౌట్ చేసింది. స్పిన్నర్లు యుజ్వేంద్ర చహల్(4/49), వాషింగ్టన్ సుందర్(3/30), పేసర్లు ప్రసిద్ధ్ కృష్ణ(2/29), మహ్మద్ సిరాజ్(1/26) చెలరేగడంతో విండీస్ స్వల్ప స్కోర్‌కే కుప్పకూలింది. జేసన్ హోల్డర్(71 బంతుల్లో 57; 4 సిక్సర్లు) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. అనంతరం ఛేదనలో రోహిత్ శర్మ(60), ఇషాన్ కిషన్(28) తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించి టీమిండియా గెలుపుకు పునాది వేయగా, ఆఖర్లో సూర్యకుమార్ యాదవ్(36 బంతుల్లో 34; 5 ఫోర్లు), దీపక్ హుడా(32 బంతుల్లో 26; 2 ఫోర్లు) మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. కోహ్లి(8), పంత్(11) మరోసారి నిరుత్సాహపరిచారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190